సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 19 । నవంబర్ । 2023



స్కూటర్‌ను ఢీకొన్న కారు

సంబేపల్లె మండల పరిధిలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై శనివారం రాత్రి స్కూటర్‌ను కారు ఢీకొనడంతో వ్యక్తి దుర్మరణం చెందాడు. - 8లో



పాలస్తీనాపై దాడులు ఆపాలి

పాలస్తీనాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను ఆపాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.300	రూ.380
రెండోరకం	రూ.200	రూ.298

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 287 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	385	432
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 195.700 కిలోలు

న్యూస్‌రీల్

స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామికి శనివారం వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్నపన తిరుమంజనం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుప్రభాత సమయాన శ్రీరామచంద్రమూర్తికి పట్టు వస్త్రాలు, పుష్పాలు, ఫలాలు, అభిషేక సామగ్రి సమర్పించారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణ మూర్తులకు అభిషేకాలు చేసి, పట్టు వస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో ముస్తాబు చేశారు. అనంతరం ఆలయ పండితులు వేద పారాయణం, సహస్ర నామార్చన, కుంకుమార్చన, మంగళహారతులతో విశేష పూజలు నిర్వహించారు.

రామయ్య సన్నిధిలో కేఎస్సార్



రంగమండపంలో కొమ్మినేని దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలోని సీతారామలక్ష్మణులను రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు(కేఎస్సార్) సతీ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, అర్చకులు ఆలయ లాంఛనాలతో వారికి స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షిణ కావించి, గర్భాలయంలోని మూల విరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు రంగమండపంలో సేదతీరి, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వీరి వెంట ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆర్ఐ రమణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆభరణాల సమర్పణ



ఆభరణాలను అందజేస్తున్న ప్రదీప్ కుమార్

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శనివారం మూల విరాట్‌కి బంగారు, వెండి ఆభరణాలు సమర్పించారు. కర్నూలువాసి ప్రదీప్ కుమార్ తన కుటుంబంతో కలిసి రెండు బంగారు ముత్యాల దండలు, ఒక వెండిహారం ఇచ్చారు. వీటి విలువ రూ.2,83,500 ఉంటుందని ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు తెలిపారు.

హైపిచ్‌లో క్రికెట్ ఫీవర్

- భారత్ కప్ గెలవాలని అభిమానుల ఆకాంక్ష
- మ్యాచ్ తిలకించేందుకు బిగ్‌స్క్రీన్ల ఏర్పాటు





కడప ఆర్ట్స్ కళాశాల మైదానంలో బారికేడ్ల నిర్మాణం

సాక్షి రాయచోటి : వరల్డ్ కప్ క్రికెట్‌లో ప్రస్తుతం భారతజట్టు వరుస విజయాలతో తిరుగులేదని నిరూపించుకుంది. ఓటమి అనే పదం తెలియకుండానే ప్రత్యర్థి జట్టును చిత్తు చేస్తూ ఫైనల్‌కు చేరింది. ఎక్కడా చూసినా అందరి నోటా ఒక్కటే మాట..ఇండియా వరల్డ్ కప్ పాట. ఇండియా–ఆస్ట్రేలియా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్‌లో జరగనున్న తరుణంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో క్రికెట్ ఫీవర్. ఇండియా కప్ గెలవాలని ప్రతి భారతీయుడు దేవుళ్లకు మొక్కుకుంటున్నారు

రాయచోటిలో భారీ స్క్రీన్ ఏర్పాటు

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు వీలుగా బిగ్‌స్క్రీన్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ 13 జిల్లాల్లో స్క్రీన్‌లను ఏర్పాటు చేసి అభిమానులను కనువిందు చేస్తోంది. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి వినతి మేరకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ రాయచోటిలో కూడా భారీ స్క్రీన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. మ్యాచ్ చూసేందుకు భారీగా అభిమానులు తరలి వచ్చే అవకాశం ఉన్న తరుణంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డితోపాటు మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

బారికేడ్ల ఏర్పాటు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానం (ఆర్ట్స్ కళాశాల)లో వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి కనువిందు చేయనున్నారు. పెద్దసంఖ్యలో క్రీడాభిమానులు, ప్రజలు మ్యాచ్‌ను వీక్షించేందుకు తరలి రానున్న నేపథ్యంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారుల సూచనల మేరకు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ ప్రతినిధులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రవేశం ఉచితం కావడంతో పెద్దసంఖ్యలో ప్రజలు విచ్చేయనున్న నేపథ్యంలో బారికేడ్లు నిర్మిస్తున్నారు. నిర్మాణపనులను శనివారం సాయంత్రం సీఏవైడీ అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి, కార్యదర్శి ఎ. రెడ్డిప్రసాద్, అబ్దుల్ ఫరూఖ్ రెహమాన్ తదితరులు పరిశీలించారు.



రాయచోటిలో బిగ్ స్క్రీన్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

ప్రత్యేక ప్రార్థనలు

కడప ఎడ్యుకేషన్ : వరల్డ్‌కప్ ఫైనల్లో భారత్ జట్టు విజయం సాధించి కప్పు గెలవాలని జే యూత్ వేల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు ఖాజాబాబా మాట్లాడుతూ టీం ఇండియా జాగ్రత్తగా ఆడాలన్నారు. గెలుపొందితే ప్రపంచ రికార్డు మన సొంతమవుతుందన్నారు.కార్యక్రమంలో వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్‌బాషా, రఫీ, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే సమాజాభివృద్ధి



రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుల విద్యార్థులతో ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి

రాయచోటి అర్బన్ : విద్యార్థి దశనుంచే పరిశోధనలు ప్రోత్సహించినట్లయితే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని కడప పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు ఎం. వెంకటకృష్ణారెడ్డి అన్నారు. శనివారం రాయచోటి డైట్‌లో ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైన్స్‌తోనే సమాజాభివృద్ధి సాధ్యమని అన్నారు.అన్నమయ్య జిల్లాలో అన్ని సైన్స్‌కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్న సైన్స్ ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఆరోగ్యం. సమాజ శ్రేయస్సు కోసం పర్యావరణాన్ని అర్థం చేసుకోవడం అనే ఇతివృత్తం ఆధారంగా బాలల సైన్స్‌కాంగ్రెస్ నిర్వహింప బడిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 112 మంది బాల శాస్త్రవేత్తలు తమ పరిశోధనా ప్రాజెక్టులను సమర్పించారు. వాటిలో ఏడు ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు.

విజేతలు వీరే

బుర్రకాయలకోట ఉన్నతపాఠశాలకు చెందిన అఫ్రా, బద్వేలు జెడ్పీహైస్కూలుకు చెందిన శివదీక్షిత, లక్ష్మిత్రివేణి రాయచోటి ఆదర్శపాఠశాల విద్యార్థిని జాహ్నవి. నిషిత, పోలేపల్లె జడ్పీహైస్కూల్‌కు చెందిన లేఖనసాహితి, నాగిరెడ్డిపల్లె జడ్పీహైస్కూల్‌కు చెందిన చాణక్య.

విద్యార్థులు కనీస సామర్థ్యాలను సాధించాలి

విద్యార్థులు కనీస సామర్థ్యాలను సాధించడానికి ప్రధానోపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలని ఆర్జేడీ సూచించారు. అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో డైట్‌లో ప్రధానోపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆప్‌కాస్ట్ జిల్లా సమన్వయకర్త రవీంద్రారెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ రవిశంకర్‌రెడ్డి, స్కాట్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, ఎం ఈఓ బాలాజి, అసిస్టెంట్ ఏఎంఓ షమీవుల్లా, ట్రైనింగ్ ఇన్‌చార్జ్ రెడ్డెయ్య, రాష్ట్ర అబ్జర్వర్ డేవిడ్, రీసోర్స్‌పర్సన్‌లు నరసింహులు, మధుమతి తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌పో కరపత్రాల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : ఈ నెల 24, 25వ తేదీ రాయచోటి పట్టణంలోని ఇంటర్నేషనల్ మెరిట్ స్కూల్లో నిర్వహించే కలాం విజన్ –2023 సైంటిఫికల్ ప్రాజెక్టు ఎక్స్‌పోను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన కార్యాలయంలో పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరాజు, ప్రాజెక్టు డైరెక్టర్ వినయ్‌కుమార్, ట్రాన్స్‌కో డీఈ చంద్రశేఖర్‌రెడ్డిలతో కలసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడానికి ఇలాంటి ప్రాజెక్టులు చాలా ఉపయోగపడతాయని చెప్పారు. ప్రాజెక్టు డైరెక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎక్స్‌పోలు పాల్గొనేందుకు అర్హులన్నారు. వివరాల కోసం 6181453550, 9391932752 నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

బుడ్డారెడ్డిగారిపల్లెలో చోరీ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, పోలీసులు

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారి సమీపంలో ఉన్న బుడ్డారెడ్డిగారిపల్లెలో శనివారం చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుడ్డారెడ్డిగారిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మధ్యాహ్నం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. ఇంటి దగ్గర ఎవరూ లేని సమయంలో.. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టారు. బీరువాలోని రూ.52 వేలు నగదుతోపాటు రెండు జతల కమ్మలు, ఒక బొట్టు చైను, ఉంగరం (32 గ్రాములు) అపహరించారు. ఈ మేరకు బాధితులు ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరివేసుకొని మహిళ మృతి



మృతి చెందిన అనుసూయ

సంబేపల్లె : ఉరి వేసుకొని మహిళ మృతి చెందిన సంఘటన సంబేపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ కొండావాండ్లపల్లెకు చెందిన రౌతు అనుసూయ (45) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేది. ఈ క్రమంలో ఆమె అప్పుల బాధతో శనివారం మన స్తాపానికి గురై తన నివాసంలో ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అనుసూయ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబేపల్లె పోలీసులు కేసు నమోదు చేశారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి



ప్రొద్దుటూరులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పుట్టపర్తి సర్కిల్‌లో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ప్రొద్దుటూరు : పాలస్తీనాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను ఆపాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. వన్‌టౌన్ సర్కిల్ నుంచి గాంధీ రోడ్డు, టీబీ రోడ్డు మీదుగా పుట్టపర్తి సర్కిల్ వరకు జరిగిన ఈ ర్యాలీలో మహిళలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ వరుసగా దాడి చేస్తోందన్నారు. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత నుంచి ఏదో ఒక రూపంలో ఈ దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ముస్లింలను దేశ ద్రోహులుగా చిత్రీకరిస్తున్నారన్నారు. బీజేపీ తొత్తులు సోషల్ మీడియాలో విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్నారన్నారు. వాస్తవానికి పూర్వం ఇజ్రాయిల్ దేశమే లేదని, బ్రిటిష్ పాలకులు పనిగట్టుకుని సామూహిక వలసవాదులను ప్రోత్సహించి ఇజ్రాయిల్‌ను ఏర్పరిచారన్నారు. పాలస్తీనా నుంచి ఆ దేశ ప్రజలు పారిపోయేలా చేశారన్నారు. పాలస్తీనాలో చమురు గనులు ఉన్నాయని, వాటిపై ఆధిపత్యం కోసమే యుద్ధాలను ప్రోత్సాహిస్తున్నారన్నారు. అమెరికా లాంటి దేశాలు ఇజ్రాయిల్‌కు మద్దతు ఇస్తున్నాయన్నారు. జమా అతె ఇస్లామి హింద్ జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ మొహిద్దీన్ ఖాన్ మాట్లాడుతూ 40 రోజులుగా పాలస్తీనాలో నరమేధం జరుగుతోందన్నారు. అతి కిరాతకంగా పిల్లలు, వృద్ధులను కూడా హతం చేస్తున్నారన్నారు. ప్రసార మాధ్యమాల్లో కూడా ఈ వార్తలు ప్రచురితం కావడం లేదన్నారు. ఇంటర్నేషనల్ మానిటరింగ్ ఫండ్ నుంచి ఇజ్రాయిల్‌కు డబ్బు సమకూరుతోందన్నారు. ఓపెన్ జైలు ఏర్పాటు చేసి లక్షలాది మందిని అందులో ఉంచి హింసిస్తున్నారని ఆరోపించారు. విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వరలక్ష్మి మాట్లాడుతూ పాలస్తీనాపై దాడులను అరికట్టేందుకు ప్రపంచ దేశాలు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు, ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి సలీం, రచయిత ఎస్పీ మహమూద్, సృజన శ్రీను, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సందీప్, విక్రమ్, చైతన్య, మైనారిటీ మహిళా విభాగం నాయకులు ఆయేషా, హసీనా, టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ అక్రమ్, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందెం స్థావరంపై దాడి

గాలివీడు : మండల పరిధిలోని సీసీ పల్లె గ్రామ కమలామారి వద్ద కోడి పందెం స్థావరంపై ఎస్ఐ వెంకట శివప్రసాద్ దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులతోపాటు మూడు కోళ్లు అదుపులోకి తీసుకుని రూ.11,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల నిఘా ఉందని, చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

9న జాతీయ లోక్ అదాలత్



న్యాయవాదులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

రాయచోటి టౌన్ : డిసెంబర్ 9వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా 5వ న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి, ప్రిన్సిపల్ జూనియర్స్ సివిల్ జడ్జి ఇస్రాత్ ఫాతిమాలు ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులు, ఇతర న్యాయవాదులతో కలసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌కు అధిక సంఖ్యలో కేసులు వచ్చి పరిష్కరించే విధంగా ప్రయత్నించాలని సూచించారు. ఒక సారి లోక్ అదాలత్‌లో సమస్య పరిష్కరిస్తే సుప్రీంకోర్టులో వచ్చే తీర్పుతో సమానం అనే విషయం కక్షిదారులకు తెలియజేయాలని చెప్పారు.

నవశకం



ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో లబ్ధిదారులలో ఆనందం వెల్లివిరుస్తోంది.గతంలో జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగినా పనులు, మంజూరు కాని పథకాలు నేడు ఇంటికే వచ్చి చేరుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఇబ్బంది లేకుండా ధ్రువపత్రాలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న సురక్షతో మేము లబ్ధి పొందాము. ఆదాయ, కుల ధృవపత్రాల కోసం గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగాల్సి వచ్చేది. అయినా ప్రయోజనం లేదు. ఆర్ఐ ఉంటే తహసీల్దారు ఉండరు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. జగనన్న సురక్షలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వెంటనే వలంటీర్ వచ్చి ఎలాంటి శ్రమ, ఖర్చు లేకుండా ధ్రువ పత్రం అందించారు. ప్రజల కోసం మంచి పథకం అమలు చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– అమడకాయల రేవతి, రాజంపేట

బడి చాలా బాగుంది



మా పాఠశాలలో గతంలో సరైన సౌకర్యాలు ఉండేవి కావు. 5 గదుల్లో కష్టంగా 10 తరగతులు నిర్వహించేవాళ్లం. ప్రస్తుత ప్రభుత్వం నాడు–నేడుతో వసతులు కల్పించింది.మా బడి చాలా బాగుపడింది. మొదటి విడత నిధులతో విద్యుద్దీకరణ, భవనాల మేజర్, మైనర్ మరమ్మతులు,ఆర్ఓప్లాంటు, హ్యాండ్‌వాష్, గ్రీన్‌చాక్‌బోర్డుల ఏర్పాటు చేసుకున్నాం.రెండో విడతలో మంజూరైన నిధులతో బాలికలకు టాయిలెట్లు, వంటగది, తాగునీటి కోసం బోరు డ్రిల్లింగ్,పైపులైన్ ఏర్పాటు చేశారు. 4 తరగతిగదులు నిర్మితమయ్యాయి.గతంతో పోల్చుకుంటే ప్రభుత్వ విద్యలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి.వసతుల కల్పనతో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు వస్తున్నారు.

– జాబీర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

సొంతింటి కల నెరవేరింది



నేను, నాభర్త వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం.చాలా ఏళ్లు పూరి గుడిసెలో నివసిస్తున్నాం. ఆర్థిక స్థోమత లేక సొంతిల్లు కలగానే మిగిలిపోయింది. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో తమకు పక్కా గృహం మంజూరైంది.ప్రభుత్వ నిధులతో గృహం నిర్మించుకున్నాం.సొంతింటి కల సాకారం చేసిన ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.

చేతిపట్టు నాగమణి, కెఎస్ అగ్రహారం, చిట్వేలి మండలం, అన్నమయ్య జిల్లా

రేషన్ కార్డు అందింది



నేను ఓ ప్రైవేటు ఆస్పత్రిలో హౌస్‌కీపింగ్ పని చేస్తున్నా. మా ఇంటియాని ఇటీవల మృతి చెందాడు. ఇల్లు గడవటం కష్టంగా మారింది. రేషన్‌కార్డు కోసం పలు సార్లు కార్యాలయాల చుట్టూ తిరిగాను. జగనన్న సురక్ష పథంలో సమస్య విన్నవించాను. దీంతో మూడు నెలల కితం రేషన్‌కార్డు ఇచ్చారు. ప్రస్తుతం రేషన్ వస్తోంది. జగనన్నకు రుణపడి ఉంటాం.

–జి.నగోమి,అమినేనివీధి, మదనపల్లె

బైక్‌లు ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనాలు ఢీకొని భార్యాభర్తలు గాయాల పాలైన సంఘటన శుక్రవారం రాత్రి రామసముద్రం మండలంలో జరిగింది. ఊలపాడు పంచాయతీ నరసాపురానికి చెందిన భార్యాభర్తలు వెంకటేష్(42), రత్నమ్మ(39) కర్ణాటకలోని ముళబాగల్‌కు భవన నిర్మాణ పనులకు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వస్తుండగా, రామసముద్రం సమీపంలో మరో వ్యక్తి ద్విచక్రవాహనంలో ఎదురుగా వేగంగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో భార్యాభర్తలు ఇద్దరూ కిందపడి గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో వారిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. రామసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని..

నిమ్మనపల్లె : కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. వెంగంవారిపల్లె పంచాయతీ చిన్నల్లవారిపల్లెకు చెందిన ఎస్.మహమ్మద్‌అలీ(49) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో బాలినాయునిపల్లెకు వెళుతుండగా.. పాత కొండసానివారిపల్లె మలుపు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మహమ్మద్‌అలీ తీవ్రంగా గాయపడగా, 108 వాహనంలో నిమ్మనపల్లె పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

అప్పు సాకుతో వెట్టిచాకిరీ చేయించుకుని చంపేశారన్న మృతుడి తండ్రి



అంజనప్ప(ఫైల్)

మదనపల్లె : మగ్గం యజమాని రుణవేధింపులు తాళలేక చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం పట్టణంలోని చౌడేశ్వరినగర్ నాలుగోవీధిలో జరిగింది. మృతుడి తండ్రి మల్లయ్య తన కుమారుడి చావుకు కారణాలపై పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దమండ్యం మండలం కొటాల పంచాయతీ మందలవారిపల్లెకు చెందిన మల్లయ్యకు అంజనప్ప(25), శివప్ప(22) ఇద్దరు కుమారులు. వీరిద్దరూ బతుకుతెరువు కోసం పదేళ్ల క్రితం మదనపల్లె నీరుగట్టువారిపల్లెకు వచ్చి మగ్గాలు నేస్తూ జీవనం సాగిస్తున్నారు. మగ్గం యజమాని ఎం.మహేష్‌బాబు వద్ద నమ్మకంగా పని చేస్తూ, 8 ఏళ్ల క్రితం కుటుంబ అవసరాల నిమిత్తం రూ.1,80,000 అప్పుగా తీసుకున్నారు. దీనికి సంబంధించి ప్రతినెలా అన్నదమ్ముల కూలి నుంచి వడ్డీ మినహాయించుకునేలా ఒప్పందం చేసుకుని బాండ్ రాసుకున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని యజమాని వారి వద్ద వెట్టిచాకిరీ చేయించుకుంటూ, పనికి తగిన వేతనం చెల్లించకపోవడంతో వారు ఇబ్బందులు పడేవారని మల్లయ్య తెలిపారు. ఈ విషయాన్ని ఇద్దరు కుమారులు తనకు తరచూ చెప్పేవారని, యజమాని వేధింపులు తాళలేక రెండోకుమారుడు శివప్ప పారిపోయాడన్నారు. మొదటి కుమారుడు అంజనప్ప స్వగ్రామానికి వచ్చేశాడన్నారు. యజమాని వేధింపులపై గాలివీడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. తర్వాత కొద్దిరోజులకు... అప్పు తీసుకుని, పనిమానేశారంటూ మగ్గం యజమాని మహేష్‌బాబు, భార్య రత్నమ్మ, బావమరిది శ్రీనివాసులుతో కలిసి తమ గ్రామానికి వచ్చి అంజనప్పతోపాటు భార్య రమణమ్మను బెదిరించారన్నారు. బలవంతంగా భార్యాభర్తలు ఇద్దరినీ మదనపల్లెకు తీసుకువచ్చి మగ్గాల మీద పనిచేయించేవారన్నారు. ఎప్పటిలాగే అంజనప్ప తనమానాన తాను మగ్గం పనిచేసుకుంటుండగా, అప్పు చెల్లించాలని యజమాని మహేష్ మళ్లీ వేధింపులు మొదలెట్టాడన్నారు. ఈ విషయాన్ని కుమారుడు తనతో చెప్పి బాధపడేవాడన్నారు. తన కుమారుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ.. మగ్గం యజమాని, అతడి కుటుంబసభ్యులు తన కుమారుడిని చంపేసి, ఉరేసుకుని చనిపోయాడంటూ ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా... శనివారం ఉదయం అంజనప్ప భార్య రమణమ్మ పిల్లలను బడిలో దింపేందుకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలపడంతో పోలీసులకు సమాచారం అందింది. సంఘటనాస్థలానికి చేరుకున్న టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

వలంటీర్‌పై దాడి



బాధితుడు బాలకృష్ణ

బి.కొత్తకోట : ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయించాలని కోరిన వలంటీర్‌పై దాడి జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గోళ్లపల్లె పంచాయతీ రఘునాథపురం దళితవాడలో ఎస్.బాలకృష్ణ వలంటీర్‌గా పని చేస్తున్నాడు. పక్కా గృహం మంజూరైన లబ్ధిదారుడు శంకరప్ప ఇంటి వద్దకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ సూచన మేరకు బాలకృష్ణ శుక్రవారం వెళ్లి గోడ నిర్మాణం పూర్తి చేయించాలని కోరాడు. దీనిపై నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడమేకాక దివ్యాంగుడైన బాలకృష్ణపై దాడి చేసి కొట్టాడు. గాయాలు కావడంతో బాధిత వలంటీర్ బి.కొత్తకోట సీహెచ్‌సీలో వైద్యం పొందాడు. తర్వాత మదనపల్లె జిల్లా ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నాడు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు మహిళల ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మండలంలోని సీటీఎం పంచాయతీ మిట్టపల్లెకు చెందిన రమేష్‌రెడ్డి భార్య అశ్విని(20) అనారోగ్య కారణాలతో శనివారం ఇంటి వద్ద పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా పట్టణంలోని అమ్మచెరువుమిట్టకు చెందిన ఆంజి భార్య ప్రియాంక(20) కుటుంబ సమస్యలతో ఇంట్లో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తిగత సమాచారం సేకరిస్తున్న తెలుగు తమ్ముళ్లు



వ్యక్తిగత సమాచారం సేకరిస్తున్న టీడీపీ కార్యకర్తలను అడ్డుకుంటున్న స్థానికులు

రాజంపేట : పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట పట్టణంలోని ఆకుల వీధిలో కొందరు తెలుగు తమ్ముళ్లు ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగత సమాచారం సేకరించారు. ఈ సంఘటన శనివారం వెలుగు చూసింది. ఓటర్ల వెరిఫికేషన్ పేరుతో ఈ వ్యవహారానికి తెరతీశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సందర్భంగా రాజంపేట మున్సిపాలిటి వైస్ చైర్మన్, రాష్ట్ర కాపు నాయకుడు మర్రి రవి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని ఆకుల వీధిలో కొందరు ఇంటింటికీ వచ్చి కుటుంబ సభ్యులు వివరాలు, ఇతర సమాచారం సేకరిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని తానే స్వయంగా గుర్తించానన్నారు. మొబైల్‌లో వ్యక్తిగత సమాచారం అప్లోడ్ చేసి, ఓటీపీ అడిగి తీసుకుంటున్నారన్నారు. వారిని తాను ప్రశ్నించానన్నారు. దానికి తనపై దుర్భాషలాడారన్నారు. మిరియాల జ్యోతి, ముని, రాజా మరికొందరు టీడీపీ కార్యకర్తలు ఇందులో ఉన్నారన్నారు. ఎందుకు వ్యక్తిగత సమాచారం సేకరిస్తున్నారని అడిగితే తన పై దాడి చేయడానికి పూనుకున్నారన్నారు. తాను పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని అనధికారికంగా సేకరిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. ఇలాంటి వ్యక్తిగత సమాచార సేకరణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందోమోనన్న అనుమానాలు బలపడుతున్నాయన్నారు. వీటికి ప్రభుత్వం అడ్డుకట్టవేయకపోతే ప్రజలు నష్టపోతారన్నారు. 'మీ భవిష్యత్తుకు బాబు భరోసా' కార్యక్రమం అని చెప్పి వ్యక్తిగత సమాచారం సేకరించి, హైదరాబాదులోని ఓ కంపెనీకి అందజేస్తున్నారన్నారు. ఫలితంగా వ్యక్తిగత సమాచారం ఇచ్చిన వారు అన్ని విధాలుగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కావున ఇలాంటి వారిని గుర్తించి, పోలీసులకు అప్పగించాలని కోరారు.

స్కూటర్‌ను ఢీకొన్న కారు

ఒకరి దుర్మరణం



మృతి చెందిన దొరబాబు

సంబేపల్లె: మండల పరిధిలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై శనివారం రాత్రి స్కూటర్‌ను కారు ఢీకొనడంతో వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. వీరబల్లి మండలం సానిపాయి అంచలవాండ్లపల్లెకు చెందిన తిమ్మిశెట్టి దొరబాబు (40) ద్విచక్ర వాహనంలో సంబేపల్లె మండలం ఎస్ సోమవరం బావులకాడపల్లెలో ఉన్న మరదలు ఇంటికి వెళ్తున్నాడు. మార్గంమధ్యలో గంగిరెడ్డి చెరువు వద్దకు రాగానే పీలేరు వైపు నుంచి రాయచోటికి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో దొరబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన మూడు రోజుల క్రిందటే కువైట్ నుంచి వచ్చినట్లు బంధువులు తెలిపారు. మృతుడి భార్య విజయ, కుమార్తె షబియా, కుమారుడు బాబు కన్నీరుమున్నీరుగా విలపించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మధుసూదన్‌రెడ్డి

రైల్వేకోడూరు : చోరీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మధుసూదన్ రెడ్డి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఆర్ఆర్ కాంప్లెక్స్ వద్ద ఈ నెల 14వ తేదీ వేచివున్న బాలిరెడ్డిపల్లికి చెందిన కిరణ్‌పై నలుగురు వ్యక్తులు దాడి చేసి రూ.3500 నగదు, ఒక సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోయారు. ఈ విషయమై 15వ తేదీ కేసు నమోదైంది. శనివారం స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఉన్న నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులు వెంకటేశ్వర, సురేష్, రమేష్‌పై గతంలో కూడా పలు కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ–2 వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బొలెరో ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలో బాధితులకు సపర్యలు చేస్తున్న స్థానికులు

చిన్నమండెం : మండలంలోని కడప–బెంగళూరు జాతీయ రహదారిపై మల్లూరు క్రాస్ వద్ద బొలెరో వాహనానికి టైర్ పగిలి ద్విచక్రవాహనాన్ని ఢీకొనగా ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు హెడ్‌కానిస్టేబుల్ ఓబులేసు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. చిన్నమండెం మండలం కేశాపురం కస్పాకు చెందిన చింతం సోమశేఖర్, అతని కుమారుడు సునీల్ కుమార్‌రెడ్డి, మరో అతను వెంకటరెడ్డిలు ముగ్గురు రాయచోటి నుంచి కేశాపురం వస్తున్నారన్నారు. గుర్రంకొండ నుంచి రాయచోటి వైపు వస్తున్న బొలెరో వాహనం మల్లూరు క్రాస్ వద్దకు రాగానే.. టైరు పగిలి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరెడ్డి, సోమశేఖర్, వెంకటరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు తెలిపారు.

దేశం గర్వించేలా క్రీడల్లో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్సీ

చిట్వేలి : విద్యార్థులు దేశం గర్వించేలా క్రీడల్లో రాణించాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన 67వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, రాష్ట్ర వ్యాయామ విద్య తనిఖీ అధికారి భానుమూర్తి రాజు పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి, ఎస్ఎఫ్ఐ సెక్రటరీ వసంత, పీడీ డేవిడ్ ప్రసాద్, పీడీ ప్రెసిడెంట్ కె.వీరాంజనేయులు, చిట్వేలి ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.